## శ్రీవివేకానందనగర్ సంక్షేమ సంఘానికి 4న ఎన్నికలు

అల్లాపూర్, జూలై 14: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీవివేకానందనగర్ సంక్షేమ సంఘానికి ఆగస్టు 4వ తేదీన ఎన్నికలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో అసోసియేషన్ సభ్యులు ఎన్నికలు నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఇంటికి ఒక ఓటు చొప్పున 1,095 ఇండ్లు ఉన్న వివేకానందనగర్ కాలనీ అధ్యక్ష పదవికి సుమారు ఆరేండ్ల సుదీర్ఘకాలం తరువాత జరుగుతున్న ఎన్నికలు కాలనీవాసుల్లో ఉత్కంఠ రేపుతున్నది. ఈ నెల 17 ఉదయం 9గంటల నుంచి 18వ తేదీ సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 29న ఉపసంహరణ ఉంటుందని ఎన్నికల అధికారి సామ కొండల్‌రెడ్డి తెలిపారు. ఆగస్టు 4న ఉదయం 6.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయని, అనంతరం ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడించనున్నట్లు తెలిపారు.

## పార్టీ శ్రేణులకు అండగా ఉంటా..

మియాపూర్, జూలై 14: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పని చేసిన పార్టీ శ్రేణులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. హైదర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో జగదీశ్వర్ గౌడ్ ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పని చేస్తానని, పార్టీ శ్రేణులు సైతం ప్రజల మధ్యలో ఉండి వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తొలి నుంచి పార్టీలో ఉండి మరింత బలపడేలా కృషి చేసిన కార్యకర్తలకు ఎప్పటికీ మంచి భవిష్యత్ ఉంటుందని జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు, కూ సత్యం గౌడ్, పార్టీ శ్రేణులు, మహిళా నేతలు పాల్గొన్నారు.

# అక్రమార్కులకు అధికార పార్టీ అండ

- పట్టించుకోని అధికారులు..
- ఆ నిర్మాణాల జోలికొస్తే బాగుండదని హెచ్చరిస్తున్న అక్కమార్కులు
- నిజాంపేట్ కార్పొరేషన్‌లో గాడితప్పుతున్న పాలన..



బాచుపల్లిలోని ఆర్టీసీకాలనీ, క్రాంతినగర్‌లో అనుమతులకు మించి నిర్మిస్తున్న బహుళ అంతస్థుల భవనం

దుండిగల్, జూలై 14: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పాలన గాడితప్పింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం అధికారులపై ఆ పార్టీ నేతల పెత్తనం ఎక్కువైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏ ఒక్క అధికారి కూడా తమ పని, తాము చేసుకోలేని దుస్థితిలో కాలం వెళ్లదీస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఏ పని చేయాలన్నా అధికార పార్టీ నేతల ఆధ్వర్యంలోనే జరుగుతుందనే విమర్శలు లేకపోలేదు. ప్రధానంగా కొందరు నేతలు కార్పొరేషన్ పరిధిలో జరిగే బహుళ అంతస్థుల నిర్మాణాలను తమ ఆదాయ వనరులుగా మార్చుకుని, అధికారుల పని తీరును నామమాత్రంగా మారుస్తున్నట్లు తెలుస్తుంది. ఇందుకు నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి, 1వ డివిజన్, బాచుపల్లి, ఆర్టీసీ కాలనీలోని క్రాంతినగర్‌లో నిర్మిస్తున్న ఓ బహుళ అంతస్థుల భవన నిర్మాణమే నిదర్శనంగా నిలుస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. క్రాంతినగర్ కమ్యూనిటీహాల్ ఎదురుగా ఓ వ్యక్తి సుమారు 200 గజాల పైచిలుకు స్థలంలో మున్సిపాలిటీ నుంచి 2023లో స్టిల్ట్+2 అంతస్థులకు అనుమతులు తీసుకుని ఏకంగా స్టిల్ట్+5 అంతస్థులు నిర్మించాడు. మరో అంతస్థును నిర్మించేందుకు మళ్లీ పిల్లర్లను రైజ్ చేశారు. ఎవరైనా ప్రశ్నిస్తే తమకు అధికార పార్టీ నేత అండ దండలు ఉన్నాయని, తమను ఎవరూ ఏం చేయలేరనే ధీమాను వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇదే విషయమై టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. నిబంధనలను కాదని సదరు వ్యక్తి అన్ని బహుళ అంతస్థులు అక్రమంగా నిర్మిస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం కాదు కదా కనీసం నోరు కూడా మెదపలేక పోతున్నారనే విమర్శలు ఉన్నాయి. సదరు నిర్మాణం విషయంలో తమకు ఇబ్బంది కలుగుతుందని, నిర్మాణాన్ని ఆపేందుకు అధికారులు ఒకటి, రెండుసార్లు ప్రయత్నించినప్పటికీ సదరు అధికార పార్టీ నేత అధికారులపై తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తున్నది. సదరు నిర్మాణం వద్దకు వెళితే బాగుండదని హెచ్చరిస్తున్నట్లు సమాచారం. ఫలితంగా స్టిల్ట్+2 అంతస్థుల భవనం కాస్తా స్టిల్ట్+6గా అవతరిస్తుందని, అయినప్పటికీ అధికారులు ఏం చేయలేకపోతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అదే ఏ అండదండా లేని సామాన్యులు నిర్మిస్తే ఇప్పటికే సదరు భవనాన్ని నేల మట్టం చేసేవారని పేర్కొంటున్నారు.

### మాపై ఒత్తిడి ఉంది..

ఇదే విషయమై నిజాంపేట్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అధికారి ప్రశాంతిని వివరణ కోరగా.. సదరు నిర్మాణంపై చర్యలు తీసుకునే విషయంలో తమపై తీవ్ర ఒత్తిడి ఉందని పేర్కొన్నారు. అయినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న సదరు భవన నిర్మాణంపై ఎస్‌టీపీ(స్పెషల్‌టాస్క్ ఫోర్స్) బృందానికి నివేదించామని ఆమె తెలిపారు. వారి నుంచి ప్రతిస్పందన రాగానే చర్యలు చేపడుతామని స్పష్టం చేశారు. - టీపీఎస్ ప్రశాంతి

## ఆరోగ్య శిబిరాల నిర్వహణ అభినందనీయం



వైద్యశిబిరంలో కాంగ్రెస్ నేత బండి రమేశ్

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 14 :ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయమని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ అన్నారు. ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని పార్టీ నేతలు శివ చౌదరి, మల్లి, బాబ్జీల ఆధ్వర్యంలో బాలాజీనగర్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవలో భాగంగా ప్రజారోగ్య కార్యక్రమాలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నెక్ట్స్ జెన్ వైద్యులు, పార్టీ నేతలు సతీశ్ రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, ప్రతాప్‌రెడ్డి, రేష్మ సుధ పాల్గొన్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ ఏడవ ఫేజ్ రేణుక ఎల్లమ్మ నాల్గవ వార్షికోత్సవం, అమ్మవారి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సతీశ్‌రెడ్డి, లక్ష్మణ్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

– బాలానగర్ డివిజన్ సంజీవయ్య కాలనీలోని శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి వార్షికోత్సవ పూజలలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంగళ్‌రావు పాల్గొని పూజలు చేశారు.

## ఆధ్యాత్మికతతో ప్రజల్లో ఐక్యత



ఆలయం వద్ద నిర్వాకులతో ఎమ్మెల్యే వివేకానంద్

జగద్గిరిగుట్ట, జూలై14 :ఆధ్యాత్మికతతో చేసే సామూహిక వేడుకలు ప్రజల్లో ఐక్యత, శాంతిని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట కూనమహాలక్ష్మినగర్ రేణుకాఎల్లమ్మ కల్యాణోత్సవంలో ఆదివారం అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా శక్తిస్వరూపిని ఆశీస్సులతో ప్రజలకు సంక్షేమం కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, వెంకటేశ్వరాలయ చైర్మన్ వేణుయాదవ్, రుద్రఅశోక్, ఎర్రలక్ష్మయ్య, మహంకాళి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, సిరిసిల్ల శాసనసభ్యులు కేటీఆర్‌ను శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రంగారావు, బీఆర్ఎస్ నాయకులు తిరుమల్లేష్, వాలా హరీశ్‌రావులతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

– శేరిలింగంపల్లి, జూలై 14



మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌ను ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుర్ల తిరుమలేశ్ ఆదివారం నందినగర్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

– కొండాపూర్, జూలై 14

## చెరువుల సుందరీకరణకు ప్రత్యేక చర్యలు



రేగులకుంట చెరువు వద్ద మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే గాంధీ

కొండాపూర్, జూలై 14 : చందానగర్ డివిజన్ పరిధి దీప్తిశ్రీనగర్ కాలనీలోని రేగులకుంట చెరువు సుందరీకరణ పనులను ఆదివారం నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పరిశీలించారు. రూ.కోటి 50 లక్షల వ్యయంతో సేల్స్ ఫోర్స్ ఐటీ సంస్థ సీఎస్ఆర్ నిధులతో సుందరీకరణ పనులను పూర్తి చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... చెరువుల పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. సుందరీకరణ పనుల అనంతరం చెరువులు అందంగా రూపుదిద్దుకున్నాయని, ప్రజలు చెరువుల సంరక్షణలో భాగస్వాములవ్వాలన్నారు. అనంతరం మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ శ్రీకాంత్, మల్లి గవడ ఫౌండేషన్ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు.

## ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నాం



కాలనీల ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ

దుండిగల్, జూలై 14 : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కృష్ణను కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారు.

– ఈనెల 21న దుండిగల్ విలేజ్‌లో జరిగే దుర్గామాత అమ్మవారి బోనాల జాతరలో పాల్గొనాలంటూ ఆలయ కమిటీ సభ్యులు శంభీపూర్‌కృష్ణను కలిసి ఆహ్వానపత్రం అందజేశారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలి

### నాగార్జునడ్రీం ల్యాండ్స్ ఓనర్ల ధర్నా




దూలపల్లి నాగార్జునడ్రీంల్యాండ్స్ కమాన్ ముందు ధర్నా చేస్తున్న ఓనర్స్

కుత్బుల్లాపూర్, జూలై 14: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ దూలపల్లిలో నాగరార్జున డ్రీం ల్యాండ్స్ ఓనర్స్ ఆదివారం కమాన్ ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అందులో ప్లాట్లు కొనుగోలు చేసిన నిర్వాహకులు మాట్లాడుతూ.. నాగర్జున డ్రీంల్యాండ్స్‌లో 6 బ్లాకులు 280 ఫ్లాట్ల విక్రయం సమయంలో సంబంధిత వెంచర్ నిర్వాహకుడు పి.నాగరాజు తమను నమ్మించి మోసం చేశారని, ప్రాంగాణంలో సూపర్ మార్కెట్, వ్యాయామశాల, సెలూన్, ఈత కొలన్, క్లబ్‌హౌస్ వంటి అదనపు సౌకర్యాలు అపార్ట్‌మెంట్ వాసులకు అందుబాటులో ఉంటాయని నమ్మబలికి తీరా ఏండ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు సంబంధిత వెంచర్ నిర్వాహకులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, తమను నమ్మించి మోసం చేసిన వెంచర్ నిర్వాహకుడు నాగరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్లకార్డులు పట్టుకొని ధర్నా చేశారు.

## ధరణీనగర్‌లో పాదయాత్ర



ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ధరణీ నగర్‌లో కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణీనగర్‌కు ముంపు ముప్పు శాశ్వతంగా తప్పించినట్లు తెలిపారు. కాలనీలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీలను సైతం వీలైనంత త్వరగా పూర్తి చేయించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, భాస్కర్, అగ్రవాసు, మహేందర్‌రెడ్డి, సత్యనారాయణ, ప్రసాద్, వెంకటేశ్వర్లు, ఇస్మాయిల్, రెహ్మాన్, ప్రేమ్ దాస్ పాల్గొన్నారు. – మియాపూర్, జూలై 14

## గంటపాటు ఏకధాటిగా వర్షం.. రోడ్లు జలమయం

కుత్బుల్లాపూర్, జూలై 14: కుత్బుల్లాపూర్‌లో రాత్రి వర్షం సుమారు గంట పాటు కురిసింది. దీంతో ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లన్నీ పూర్తిగా జలమయంగా మారాయి. ప్రధాన చౌరస్తాలో వర్షం నీటితో ట్రాఫిక్ స్తంభించింది. చింతల్, ఐడీపీఎల్, కుత్బుల్లాపూర్ చౌరస్తా, షాపూర్‌నగర్ చౌరస్తా, సూరారం చౌరస్తాతో పాటు దూలపల్లి, కొంపల్లి, సుచిత్ర ప్రాంతాల్లోని వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. జంట సర్కిళ్లతో పాటు దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీ, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వర్షంతో లోతట్టు ప్రాంతాల్లో జలమయంగా మారింది. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో 14.6 ఎంఎం, గాజుల రామారం సర్కిల్ 8.2 ఎంఎం శాతం చొప్పున వర్షపాతం నమోదైంది. కాగా, ఒక్కసారిగా కురిసిన వర్షంతో ఆదివారం రాత్రి కావడంతో ఆయా విభాగాల అత్యవసర సేవలు ముందస్తుగా అలర్ట్ కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



# జర్నలిస్టుల కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

### ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టుల కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

దుండిగల్,జూలై14 : నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి, జర్నలిస్టుల కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. బోనాల పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో జర్నలిస్టుల కాలనీ ప్రజల ఆరాధ్యదైవం చెర్ల ఎల్లమ్మ ఆలయానికి దారి ఏర్పాటు, అదేవిధంగా కాలనీవాసుల కోసం పార్కు, కమ్యూనిటీహాల్, ప్లేగ్రౌండ్ వంటి వసతులు కల్పించాలని కోరుతూ ఆదివారం కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన వివేకానంద్ జర్నలిస్టుల కాలనీ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్, కార్పొరేటర్లు బాలాజీనాయక్, సుజాత, బీఆర్ఎస్ పార్టీ నిజాంపేట్ అధ్యక్షులు రంగరాయప్రసాద్, జర్నలిస్ట్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు అస్కాని మారుతీసాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కర్ల లాలయ్య, కార్యవర్గ సభ్యులు జగదీశ్, కృష్ణారావు, సత్యనారాయణ, దేవేందర్‌గుప్త, పితాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

– హెచ్ఎంటీ ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ ఐదు దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, గండిమైసమ్మలోని వేదిక గార్డెన్స్‌లో వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేశ ప్రగతిలో హెచ్ఎంటీ కంపెనీ, ఉద్యోగులు అందించిన సేవలు ఎనలేనివన్నారు. అంతకు ముందు ఆయన సొసైటీ డైరెక్టర్లను సత్కరించారు.

## చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అల్లాపూర్, జూలై 14: గుర్తు తెలియని వ్యక్తి ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చేటుచేసుకున్నది.

పోలీసులు తెలిపిన ప్రకారం... అల్లాపూర్ డివిజన్ బ్యాకర్స్ కాలనీ సర్వే నంబర్ 1007లో ఖాళీ ప్రదేశంలో ఓ చెట్టుకు మనిషి మృతదేహం వేలాడుతూ ఉందన్న సమాచారం తెలుసుకున్న పోలీస్ పెట్రోలింగ్ సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించగా.. అప్పటికే అతడు మృతి చెందినట్లు గుర్తించారు.

మృతుడు 45, 50 సంవత్సరాల లోపు ఉండవచ్చని, ఆకుపచ్చ రంగు షర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, వ్యక్తికి సంబంధించి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ద్యాప్తు చేస్తున్నారు.

## బాచుపల్లిలో వైభవంగా జగన్నాథస్వామి రథోత్సవం



నిజాంపేట్‌లోని శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయం వద్ద జరిగిన జగన్నాథ స్వామి రథోత్సవంలో పాల్గొన్న కొలన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు

దుండిగల్, జూలై 14 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి, నిజాంపేట్‌లల్లో ఆదివారం జగన్నాథస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. కార్పొరేషన్ పరిధి, 20వ డివిజన్ జయదీపిక ఎస్టేట్స్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొని మాట్లాడారు. శ్రీకృష్ణపరమాత్ముడు భగద్గీత ద్వారా మానవులకు సన్మార్గాన్ని తెలియజేశారని తెలిపారు. కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్, కార్పొరేటర్లు బాలాజీనాయక్, సుజాత, బీఆర్ఎస్ పార్టీ నిజాంపేట్ అధ్యక్షులు రంగరాయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

– నిజాంపేట్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం వద్ద ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జగన్నాథస్వామి రథోత్సవంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంగారు, వెండితో చేయించిన చీపుర్లతో రథం ప్రయాణించే దారిని కొలన్ శ్రీనివాస్‌రెడ్డి శుభ్రం చేశారు. వేడుకల్లో ఇస్కాన్ ప్రతినిధులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బోనాలు శాంతియుతంగా జరుపుకోవాలి

### బాలానగర్ సీఐ నవీన్‌కుమార్



ఆలయాల కమిటీ సభ్యుల సమావేశంలో పాల్గొన్న బాలానగర్ సీఐ పి.నవీన్‌కుమార్

బాలానగర్, జూలై 14 : ఆషాడ మాసం బోనాల పండుగ వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని బాలానగర్ సీఐ పి. నవీన్‌కుమార్ సూచించారు. ఆదివారం బాలానగర్ పీఎస్‌లో సీఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో పలు ఆలయాల ప్రతినిధులతో, నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆషాడ బోనాలు అందరికీ ప్రీతికరమైనవన్నారు. ప్రశాంత వాతావరణంలో బోనాలు జరుపుకోవడానికి ఆలయ కమిటీలు, ఉత్సవ కమిటీలు కృషి చేయాలని సూచించారు. బోనాల సందర్భంగా శాంతి భద్రతలకు ఎలాంటి భంగం కలుగకుండా ప్రతిఒక్కరూ సంయమనం పాటిస్తూ వేడుకలు ఆద్యంతం భక్తి పారవశ్యం ఉట్టి పడేలా ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. బోనాల ఉత్సవ కమిటీలు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, ఉత్సవాల్లో డీజేలకు ఎలాంటి అనుమతిలేదని స్పష్టం చేశారు. ఆలయాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయాల్లో కనీస సదుపాయాలు కల్పించాలని ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీల సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సరళ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న భరతనాట్య నృత్య ప్రదర్శన



వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు కళాకారుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. బెంగళూరుకు చెందిన ఫ్లూట్ ఎంఫీట్ అకాడమీ నిర్వాహకులు అరణ్య నరైన్ శిష్య బృందంతో కలిసి ప్రదర్శించిన భరతనాట్య నృత్యాలు ప్రత్యేకంగా అలరించాయి. ప్రదర్శనల్లో విష్ణు కౌతం, శ్రీవల్లి, మాథెయ్ మళైద్వజ, చూడరేయ్, ప్రదోష కృతి, రంజని మల శివస్తుతి అంశాలను శ్రేయ, అనన్య, వర్ష, రీతూ, యశస్విని, శ్రావ్య, ప్రీతలు భరతనాట్య నృత్యరూపకంలో ప్రదర్శించిన తీరు ఆద్యంతం ఆకట్టుకుంది. – కొండాపూర్, జూలై 14

## చెత్తతో బేజారు..

స్వచ్ఛత సాధనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రకటనలకే సరిపోతున్నాయి. స్వచ్ఛత సాధన కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో అధికార యంత్రాంగం రెండు మూడు రోజుల హడావిడి చేసి ఫొటోలతో సరిపెట్టుకుంటున్నారు. ఆ తర్వాత పరిస్థితులు ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. దీనికి నిదర్శనంగా శేరిలింగంపల్లి సర్కిల్ –20 పరిధి కొండాపూర్ డివిజన్ ప్రేమ్‌నగర్ బీ బ్లాక్ 40 ఫీట్ రోడ్డులో కుప్పలు తెప్పలుగా చెత్త కుప్పలు దర్శనమివ్వడమే. ఫిర్యాదు చేసిన ప్రతీసారి అధికారులు హడావిడి చేసి చెత్తను తొలగించడంతోనే సరిపెట్టుకుంటున్నారే తప్పా, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదంటూ స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. – కొండాపూర్, జూలై 14

